"మధురమైన పిల్లలూ - మీరు పురుషార్థము చేసి ఎయిర్ కండిషన్ టికెట్ ను తీసుకోవాలి, ఎయిర్ కండిషన్ టికెట్ ను తీసుకోవడము అనగా మాయ యొక్క వేడి గాలులు మరియు దాడుల నుండి సురక్షితంగా ఉండడము"

ప్రశ్న:- పిల్లలైన మీకు మహా వినాశనము యొక్క దుఃఖము కలుగుతుందా, కలుగదా? ఈ పాపము ఎవరికి అంటుకుంటుంది?

జవాబు:- మీకు ఈ మహా వినాశనము యొక్క దుఃఖము కలుగదు, ఎందుకంటే మీరు ఫరిశ్తాలుగా అవుతారు. ఇప్పుడు ఆత్మలందరూ దోమల గుంపు వలె తిరిగి ఇంటికి వెళ్ళాలి అన్న జ్ఞానము మీకు ఉంది. మీకు ఎవరి మృత్యువు పట్ల దుఃఖము కలుగదు ఎందుకంటే మీరు సాక్షీగా అయి చూస్తారు, ఆత్మ అయితే సదా అమరముగా ఉంటుంది అని మీకు తెలుసు. ఈ వినాశనపు పాపము ఎవరికీ అంటదు, ఇది యుద్ధము కొరకు రచించిన యజ్ఞము వంటిది. అందరూ యుద్ధము చేసుకుని, మరణించి తిరిగి ఇంటికి వెళ్తారు. ఇది కూడా డ్రామాలో రచించబడింది.

పాట:- సభలో జ్యోతి వెలిగింది... (మహఫిల్ మే జల్ ఉఠీ షమా...)

ఓం శాంతి. పిల్లలు పాటలోని ఒక లైన్ ను విన్నారు. ఇది ఎవరి సభ? జ్ఞాన సాగరుని సభ. దీనినే మనుష్యులు ఇంద్రుని సభ అనగా ఇంద్రసభ అని అంటారు. చాలామంది మనుష్యులు - ఇంద్రుడు నీటి వర్షాన్ని కురిపిస్తాడని భావిస్తారు. ఇది జ్ఞాన సాగరుడైన పరమపిత పరమాత్మని సభ అని పిల్లలు భావిస్తారు, ఇక్కడ జీవిస్తూనే వారికి చెందినవారిగా అయ్యేందుకు అనగా ఈ ప్రపంచము నుండి మరణించేందుకు దీపపు పురుగులు కూర్చున్నారు, ఎందుకంటే జీవాత్మలకు ఇప్పుడు ఈ పాత ప్రపంచమంటే ఇష్టం లేదు. ఇందులో అందరూ ఒకరితో ఒకరు కొట్లాడుకుంటూ ఉంటారు. నేను స్వర్గ స్థాపన చేస్తాను అని తండ్రి అంటారు. పిల్లలలో కూడా నంబరువారుగా ఉన్నారు. కొందరు పుష్యరాగములా, కొందరు నీలమణిలా ఉన్నారు (నవరత్నాలలోని రకాలు). పేర్లు అయితే ఎన్నో ఉన్నాయి. ఈ విధంగా పోల్చడం జరిగింది. కొందరు పిల్లలు మంచి వివేకవంతులుగా అయి ఇతరుల సేవలో నిమగ్నమైపోతారు. సేవలో కూడా ఎవరు తత్పరులవుతారు? ఎవరైతే దీపముపై పూర్తిగా బలిహారమై ఉంటారో వారు. ఇది చాలా పెద్ద సభ. బాబా ఆత్మల సభలోకి వచ్చారని మీకు తెలుసు. కానీ ఎవరికైతే వీరి గురించి బాగా తెలుసో, వారే వీరి సమ్ముఖములో ప్రాక్టికల్ గా ఉన్నారు. ఈ సమయంలో కోట్లల్లో కొద్దిమందికి మాత్రమే తెలుసు. ఎవరైతే దీపపు పురుగులుగా ఉన్నారో, ఎవరైతే బలిహారమవుతారో, బాబాకు చెందినవారిగా అవుతారో, వారే తెలుసుకుంటారు.

ఇదే జీవిస్తూ మరణించడం అని అర్థం చేయించడం జరిగింది. బాబా, నేను మీకు చెందినవాడిని. మొదట మేము మీ వద్ద అశరీరిగా ఉండేవారము. తర్వాత ఇక్కడకు వచ్చి శరీరాన్ని తీసుకుంటాము. పిల్లలకు ఏ జ్ఞానమైతే లభిస్తుందో దానిని ఇతరులెవ్వరూ ఇవ్వలేరు ఎందుకంటే వారికి తండ్రి గురించి తెలియదు. పిల్లలైన మిమ్మల్ని పరమపిత పరమాత్మ వచ్చి చదివిస్తారు. సర్వ వేద శాస్త్రాలు మొదలైనవన్నీ గీతలోని ఆకులు అని అంటూ ఉంటారు. మనుష్యమాత్రులందరూ ఈ రంగస్థలముపై దేనికి ఆకులుగా ఉన్నారు? ఈ దేవీ-దేవతా ధర్మము నుండే అందరూ వెలువడ్డారు, అందుకే వృక్షము యొక్క చిత్రములో మీరు చూస్తారు - మొదట్లో ఆకులు లేవు. ఆకులు తర్వాత చిగురిస్తాయి, అందుకే వాటిని పైన చూపించడం జరిగింది. పునాది దేవీ-దేవతా ధర్మము. మొదట కాండము ఒకటే ఉంటుంది, ఆ తర్వాత దాని నుండి శాఖోపశాఖలు వెలువడుతాయి, ఆ తర్వాత ఆకులు వెలువడుతాయి. ఇది మనుష్య సృష్టిలో ఉన్న ధర్మాల యొక్క విరాట వృక్షమని పిల్లల బుద్ధిలో ఉంది. ఈ రోజుల్లోని ప్రభుత్వము ధర్మాన్ని అంగీకరించదు. మనమందరమూ పరస్పరం కలిసి ఉండగలము అని అంటుంది. కానీ పరస్పరం ఎన్ని గొడవలు ఉన్నాయి. యుద్ధము కోసమనే యజ్ఞాన్ని రచించినట్లుగా, పరస్పరం యుద్ధము కొనసాగుతూనే ఉంటుంది. ఎక్కడో అక్కడ గొడవపడుతూ-కొట్లాడుకుంటూనే ఉంటారు. ఇది కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. అందరూ పరస్పరం కొట్లాడుకుని మరణించేలా యుక్తులను రచిస్తారు. ఇంతకుముందు హిందుస్థాన్, పాకిస్థాన్ ఏమైనా వేరువేరుగా ఉండేవా, అన్నీ కలిసి ఉండేవి. ప్రభుత్వము కూడా శక్తివంతముగా ఉండేది. పరస్పరంలో ఎవ్వరూ కొట్లాడుకోలేకపోయేవారు, ఎందుకంటే వారి పైన గొప్ప-గొప్ప నవాబులు ఉండేవారు. ఏ విధంగానైతే ఇప్పుడు మొత్తం ప్రపంచమంతటికీ ఐక్యరాజ్యసమితి మొదలైన పెద్ద-పెద్ద కమిటీలు ఉన్నాయి కదా. కానీ వీరందరికీ నాథుడు ఎవరూ

లేరు. రెండు ముక్కలుగా అయిపోయారు. దుఃఖము వృద్ధి చెందుతూనే ఉంటుంది. ఒకరినొకరు హతమార్చుకుంటూనే ఉంటారు. డ్రామాలో ఎటువంటి రహస్యముందో చూడండి. ఒకరితో ఒకరు కొట్లాడుకుంటారు కావున తండ్రికి పాపము అంటదు. నేను సాక్షీగా అయి చూస్తాను. అందరూ కొట్లాడుకొని తప్పకుండా అంతమవ్వనున్నారని మీకు తెలుసు. ఎవరైనా గొప్ప వ్యక్తి మరణిస్తే 8-10 రోజులు వారి పేరు మీద ఎన్నోకొన్ని కార్యక్రమాలు జరుగుతాయి. సెలవులు మొదలైనవి ఇస్తారు. కానీ మీ కోసమైతే ఏమీ లేవు. మీరు ఫరిశ్తాలుగా అవుతున్నారు. మీకు వినాశనము యొక్క దుఃఖం కూడా కలుగదు. ఇప్పుడైతే దోమల గుంపులా మరణిస్తారు, అప్పుడిక ఎవరు ఎవరిని చూసుకుంటారు! ఈ రహస్యము పిల్లలైన మీకు మాత్రమే తెలుసు.

కొత్త ప్రపంచంలో ఉండేవారైతే చాలా ఫస్ట్ క్లాస్ అయినవారు కావాలి. ఇక్కడ ఎవరైనా మరణిస్తే మీకు దుఃఖం కలుగుతుందా. వీరు వెళ్ళి తమ పాత్రను అభినయించేందుకు ఇంకొక శరీరాన్ని తీసుకున్నారు - అని మీరు సాక్షీగా చూస్తారు. మీలో కూడా అందరూ నిశ్చయబుద్ధి కలవారు లేరు. గృహస్థ వ్యవహారములో ఉంటూ కాలి నుండి పిలక వరకూ ఇప్పుడు సంతోషపు పాదరసము పైకెక్కుతోంది, కాకపోతే కొందరికి తక్కువ, కొందరికి ఎక్కువ ఎక్కుతుంది. కొందరికైతే పైస అంత కూడా ఎక్కదు, పిండిలో ఉప్పు అంత ఉంటుంది. అటువంటివారిని చప్పగా ఉన్నారు అని అంటారు. నారాయణీ నషా ఎవరికి ఎక్కుతుంది అనేది తెలిసిపోతుంది. అటువంటివారు మాత-పితల సేవ చేస్తారు. గృహస్థ వ్యవహారములో ఉంటూ సేవ చేయలేరని కాదు. వారు ఇంకా ఎక్కువ సేవ చేస్తారు, ఇంకా ఎక్కువ మాత-పితల పేరును ప్రఖ్యాతము చేస్తారు. గృహస్థ వ్యవహారములో ఉంటూ కమలపుష్ప సమానముగా అచలముగా, స్థిరముగా తయారై, మళ్ళీ ఇతరులను కూడా అలా తయారుచేస్తారు. కావున వారి మహిమ ఎక్కువగా ఉంటుంది. మీరైతే ప్రారంభములో వెలువడ్డారు. అది కూడా డ్రామాయే. భట్టీ తయారవ్వాల్సి ఉంది, అందులో నుండి కూడా కొందరు అపరిపక్వమైన ఇటుకలు వెలువడ్డారు, కొందరు పరిపక్వమైనవారు వెలువడ్డారు. ఐ.సి.యస్. పరీక్షలో అందరూ పాస్ అవ్వరు కదా, ఎందుకంటే వారికి గవర్నమెంట్ ఎంతో జీతాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా అలాగే. చాలా ఆస్తిని ఇవ్వాల్సి ఉంటుంది. ముఖ్యమైన ఎనిమిది మంది పాస్ అవుతారు, ఆ తర్వాత 108 మంది మాల తయారవుతుంది. పురుషార్థము చేసి ఉన్నత పదవిని పొందాలి. ఫస్ట్ క్లాస్, ఎయిర్ కండిషన్ లో రిజర్వ్ చేసుకుంటారు కదా. ఎయిర్ కండిషన్ లో ఎప్పుడూ వేడి గాలులు తగలవు. మీకు కూడా ఈ ప్రపంచం యొక్క ఏ వేడి గాలులు తగలకూడదు అనగా మాయ దాడి ఏమీ జరగకూడదు, అంత శక్తివంతముగా అవ్వాలి. ఎనిమిది మందైతే పూర్తిగా ఫస్ట్ క్లాస్ గా ఉన్నారు, ఆ తర్వాత 108 మంది ఉంటారు. మహారథులు, గుర్రపు స్వారీ చేసేవారు, పాదచారులు అన్న పేర్లు కూడా ఉన్నాయి. మేము ఏ టికెట్ ను ఖరీదు చేస్తున్నామనేది ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోగలరు. ప్రతి ఒక్కరూ టికెట్ తీసుకోవాలి. పురుషుడు వేరుగా, స్త్రీ వేరుగా తమ-తమ టికెట్లను తీసుకోవాలి. స్త్రీకి అవకాశం ఎక్కువ ఉంది ఎందుకంటే పురుషుడు ఏదైతే చేస్తారో అందులో సగభాగం స్త్రీకి లభిస్తుంది. స్త్రీ ఏదైనా వ్యాపారం చేస్తే, ఆమె ఏదైనా ఇస్తే, అందులోని భాగం పతికి లభించదు ఎందుకంటే పురుషుడు రచయిత. ధనం పురుషుని చేతిలో ఉంటుంది. అతను ఏమి చేసినా అందులోని భాగం స్త్రీకి లభిస్తుంది. స్వర్గములోనైతే ఇరువురూ యజమానులుగా ఉంటారు. కొడుకు ఒక్కడే ఉంటాడు, వారసత్వాన్ని కూడా అతనే పొందుతాడు. కన్య కూడా తన భాగాన్ని నియమానుసారముగా తీసుకుంటుంది. కల్పపూర్వము ఏ నియమమైతే కొనసాగిందో అదే కొనసాగుతుంది. అక్కడి ఆచార-వ్యవహారాలను గురించి ఆలోచించకూడదు. రాజధాని ఎలా ట్రాన్స్ఫర్ అవుతుంది అనేటువంటి సాక్షాత్కారాలను బాబా ఎన్నో చేయించారు. ఇక్కడ అలా ట్రాన్స్ఫర్ అయినట్లయితే బ్రాహ్మణులను, గురువులను మొదలైనవారిని పిలవడం జరుగుతుంది. పూర్వము ఉన్న ఆచార-వ్యవహారాలు చాలా బాగుండేవి. వానప్రస్థాన్ని తీసుకున్నప్పుడు - ఇప్పుడు నువ్వు ఈ కార్యవ్యవహారాలను సంభాళించు అంటూ కొడుకును ఎంతో ప్రేమగా సింహాసనముపై కూర్చోబెట్టేవారు. ఇప్పుడైతే పూర్తిగా ముసలివారిగా అయిన తర్వాత కూడా వదలరు. పూర్వము పిల్లలు మాతృ స్నేహీలుగా ఉండేవారు, ఇప్పుడు మాతృ ద్రోహులుగా అయిపోయారు. తల్లిని కూడా జుట్టు పట్టుకొని బయటకు తోసేస్తారు. దీనినే అంధకారమయము, మాతృ ద్రోహము అని అంటారు. సత్యయుగములో ఇటువంటి విషయాలు ఉండవు. మీకైతే ఎంతో సంతోషము ఉండాలి. సభ యొక్క అనుభూతి మీకు ఇక్కడ కలుగుతుంది. ఈ జ్ఞాన సాగరుడు ఎక్కడ ఉంటే అక్కడ మేళా జరుగుతుంది. నదుల మేళా జరుగుతుంది కదా. నదులైన మీరైతే పరస్పరం కలుసుకుంటూ ఉంటారు. ఇదేమో జ్ఞానసాగరుడు మరియు నదుల మేళా. వీరు జగదాంబ సరస్వతి, వీరి పేరు కూడా ఎంతో ప్రసిద్ధమైనది. ఈ తల్లిని కలుసుకునేందుకు కూడా ఎంతమంది వచ్చేవారు ఎందుకంటే వీరి మురళి చాలా బాగుండేది. మమ్మా మురళి ఎంతో ఆకర్షించేది అని పిల్లలు కూడా అనుభవం చేసేవారు.

ఇది సాగరము మరియు నదుల సభ. ఎంతోమంది పిల్లలు వస్తారు. మొదట సాగరము, ఆ తర్వాత నదులు, చిన్న నదులు, పెద్ద కాలువలు మొదలైనవన్నీ ఉంటాయి కదా. నేను చిన్న నదినా లేక పెద్ద నదినా? అన్నది మీలో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోగలరు. వచ్చి భాషణ చెయ్యండి అని పెద్ద-పెద్ద నదులను పిలుస్తారు. కావున తప్పకుండా వారు చురుకైనవారు. మమ్మాను ఎంతగా పిలుస్తూ ఉండేవారు. శివబాబా ద్వారా లభించిన ఖజానాను వచ్చి ఇవ్వండి అని అంటారు. కుమార్తెలైన మీరు వెళ్ళి జ్ఞాన రత్నాలను దానం చేస్తారు. జ్ఞానపు ఒక్కొక్క మహావాక్యం లక్షల రూపాయల విలువ చేస్తుంది. శాస్త్రాలలో జ్ఞానం యొక్క మహావాక్యాలేమీ ఉండవు. ఒకవేళ ఉన్నట్లయితే భారత్ చాలా షావుకారుగా ఉండేది. మీకు ఇప్పుడు రత్నాలు లభిస్తాయి, వీటి ద్వారా మీరు 21 జన్మల కొరకు షావుకార్లుగా అవుతారు. ఇప్పుడు సంగమయుగములో మీరు అందరికన్నా ఉన్నతంగా ఉన్నారు. తర్వాత సత్య, త్రేతాయుగాలలో మీ డిగ్రీ తగ్గిపోతుంది. ఇప్పుడు మీరు ఈశ్వరీయ దర్బారులో కూర్చున్నారు. బాబా 21 జన్మల వారసత్వాన్ని ఇచ్చేవారు అని మీకు తెలుసు. వారినే అందరూ స్మృతి చేస్తారు. మిగిలినవారంతా దుఃఖాన్ని ఇచ్చేవారే. దుఃఖాన్నిచ్చే వస్తువును ఎల్లప్పుడూ మర్చిపోవడం జరుగుతుంది. ఓ బాబా, మా వారు అయితే మీరే, ఇంకెవ్వరూ కాదు. కానీ శ్రీకృష్ణుని పేరును విన్నప్పుడు వారినే తలచుకుంటారు. మీరు శ్రీకృష్ణుని రాజధానిలో ఉండేవారు. తండ్రి ఈ కంసపురిని శ్రీకృష్ణపురిగా తయారుచేస్తారు. అసురీపురి నుండి మళ్ళీ దైవీపురిగా తయారవుతుంది. అసురులకు మరియు దేవతలకు యుద్ధము జరిగిందని, దేవతలకు విజయం లభించిందని చూపిస్తారు. దేవతలు స్వర్గములో ఉంటారు. నిజానికి మీ యుద్ధం పంచ వికారాలతో జరుగుతుంది. ఇప్పుడు రామాయణాన్ని ఎక్కువగా పఠించడం జరుగుతుంది ఎందుకంటే దసరా రాబోతుంది. ప్రభుత్వము కూడా జరుపుకుంటుంది. రామలీలను చూపిస్తారు కానీ ఆ రావణుడు ఎవరు అనేది తెలియదు.

చాలామంది పిల్లలు - యోగంలో కూర్చోబెట్టండి అని అంటారు. నిజానికి స్మృతి అనేది నడుస్తూ, తిరుగుతూ చేయాలి. కానీ ఎవరైతే రోజంతటిలోనూ స్మృతి చేయరో వారిని కూర్చోబెట్టడం జరుగుతుంది ఎందుకంటే ఇక్కడ కూర్చుంటే ఎంతో కొంత స్మృతి చేస్తారు. చాలామంది సెంటర్లకు వచ్చినప్పుడు స్మృతిలో ఉంటారు, మళ్ళీ ఇంటికి వెళ్ళగానే సమాప్తము. స్మృతి చేసే అభ్యాసము లేదు. బుద్ధి అటూ-ఇటూ భ్రమిస్తూ ఉంటుంది. ఆత్మ ఒక స్టార్ వంటిదని, దానిని బిందువు అని కూడా అంటారని పిల్లలకు అర్థం చేయించడం జరుగుతుంది. స్టార్ లో కోణాలు ఉంటాయి, బిందువులో అవి ఉండవు. స్టార్ అని పోల్చడానికి మాత్రమే అంటారు. లక్కీ సితారలు అని అంటారు. బిందు రూపమైన ఆత్మలో జ్ఞానపు ప్రకాశము ఉంది. ఆత్మా బిందువులోనే పాత్ర అంతా ఉంది. తండ్రి అంటారు, బిందువునైన నాలో ఈ-ఈ పాత్ర ఉంది, దానిని నేను భక్తిలో అభినయిస్తూ వచ్చాను. పిల్లలైన మీకు అందరికన్నా ఎక్కువ పాత్ర ఉంది ఎందుకంటే మీరు మొత్తం చక్రాన్ని చుడతారు. కావున చక్రవర్తీ రాజులుగా కూడా మీరే అవుతారు. దుఃఖాన్ని అయినా లేక సుఖాన్ని అయినా మీరే పొందుతారు. నా పాత్ర మీ అంత ఉండదు. నేను వానప్రస్థములోకి వెళ్ళిపోతాను. మళ్ళీ భక్తి మార్గములో నా సేవ ప్రారంభమవుతుంది. స్మృతిని కూడా డ్రామానుసారముగా చేస్తారు, ఏయే దేవతలను పూజిస్తారో వారి సాక్షాత్కారాన్ని కూడా నేనే చేయిస్తాను. డ్రామాలో నా పాత్ర ఇది. కానీ మాకు వీరి ద్వారా సాక్షాత్కారం జరుగుతుంది, వీరిలో కూడా భగవంతుడు ఉన్నారు అని వారు భావిస్తారు. గణేషుని ద్వారా సాక్షాత్కారం జరిగిందంటే, గణేషునిలో కూడా పరమాత్మ ఉన్నారని భావిస్తారు. దీని నుండే సర్వవ్యాపి జ్ఞానాన్ని తీసుకున్నారు. మేమంతా బాబాను స్మృతి చేస్తాము అని పిల్లలైన మీరందరూ అంటారు అనగా అందరిలోనూ బాబా స్మృతి ఉంది, దీని వలన కూడా సర్వవ్యాపి అని భావిస్తారు. తండ్రి అంటారు, నా స్మృతిలో కూడా అందరూ నంబరువారు పురుషార్థానుసారముగా ఉంటారు. ఎవరు ఎంతగా స్మృతి చేస్తే అంతగా వికర్మలు వినాశనమవుతాయి. ఇకపోతే ఆత్మ పరంగా అందరిలోనూ తమ-తమ ఆత్మ ఉంది. నేను ఏ బిడ్డలోనైనా ప్రవేశించి ఎవరి కళ్యాణాన్ని అయినా చేయగలను. కానీ వారు దానికి తప్పుడు అర్థాన్ని చూపించారు. డ్రామాలో అది కూడా నిశ్చితమై ఉంది. డ్రామానుసారముగా అందరికీ పాత్ర లభించింది. ఈ శాస్త్రాలు మొదలైనవాటిని తయారుచేసే పాత్ర కూడా డ్రామాలో ఉంది. ఎవరైతే ఇంతకుముందు తయారుచేసారో వారే తయారుచేస్తారు. గీతను వినిపిస్తారు, మళ్ళీ కల్పం తర్వాత అదే విధముగా వినిపిస్తారు. ఇప్పుడు పిల్లల సభలో తండ్రి కూర్చున్నారు. ఎవరికైతే నేను తెలుసో నేను వారి మధ్యలోనే శోభిస్తాను. ఇకపోతే ఎవరికైతే నా గురించి తెలియనే తెలియదో ఆ సభలో కూర్చొని ఏమి చేయాలి? మీరు భాషణ మొదలైనవి చేసేటప్పుడు ఎంతోమంది వస్తారు. దానిని దీపముతోపాటు ఉన్న సభ అని అనరు. దీపముతోపాటు ఉన్న సభ ఇక్కడే ఉంది. కొందరు బలిహారమవుతారు, మళ్ళీ వేరేవైపుకు బుద్ధియోగము వెళ్ళిపోతుంది. ఎప్పటివరకైతే సంపూర్ణులుగా అవ్వరో అప్పటివరకూ బుద్ధి వెళ్తుంది. కర్మాతీత అవస్థ, సంపూర్ణ నిర్వికారీ అవస్థ అని ఇప్పుడు అనలేము. అది అంతిమంలోనే ఉంటుంది. అప్పుడిక ఈ పాత శరీరాన్ని విడిచిపెడతారు.

ఇది పాత శరీరము. ఆత్మ ఈ పాత కర్మేంద్రియాలతో పని చేస్తుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. శివబాబా ద్వారా లభించిన ఖజానాను అందరికీ పంచాలి. అవినాశీ జ్ఞాన రత్నాలను దానం చేసి 21 జన్మల కొరకు షావుకార్లుగా అవ్వాలి.

2. మీ అవస్థను అచలముగా, స్థిరముగా తయారుచేసుకోవాలి. గృహస్థ వ్యవహారములో ఉంటూ కూడా కమలపుష్ప సమానముగా అయి తండ్రి పేరును ప్రసిద్ధము చేయాలి. సేవలో తత్పరులై ఉండాలి.

వరదానము:- సంగమయుగపు ఈ కొత్త యుగంలో ప్రతి క్షణము కొత్తదనాన్ని అనుభవం చేసే ఫాస్ట్ పురుషార్థీ భవ

సంగమయుగంలో అంతా కొత్తగా అయిపోతుంది, అందుకే దీనిని కొత్త యుగము అని కూడా అంటారు. ఇక్కడ లేవడము కూడా కొత్తగానే, మాట్లాడడం కూడా కొత్తగానే, నడవడము కూడా కొత్తగానే ఉంటుంది. కొత్తదనము అనగా అలౌకికత. స్మృతిలో కూడా కొత్తదనము వచ్చింది. విషయాలు కూడా కొత్తవి, కలుసుకోవడం కూడా కొత్తగా, చూడడం కూడా కొత్తగా. చూసేటప్పుడు ఆత్మ ఆత్మను చూస్తుంది, శరీరాన్ని కాదు. సోదర దృష్టితో సంపర్కంలోకి వస్తారు, దైహిక సంబంధంతో కాదు. ఇలా ప్రతి క్షణము మీలో కొత్తదనాన్ని అనుభవం చేయండి. ఒక క్షణము క్రితము ఉన్న అవస్థ మరుక్షణము ఉండకూడదు, అంతకన్నా ముందుకు వెళ్ళాలి. ఇటువంటివారినే ఫాస్ట్ పురుషార్థీ అని అంటారు.

స్లోగన్:- పరమాత్మ ప్రేమ ద్వారా జీవితంలో సదా అతీంద్రియ సుఖాన్ని మరియు ఆనందాన్ని అనుభూతి చేయడమే సహజయోగము.